

# తల్లిప్రేమ

జి.వి. శ్రీదేవి

సాత్వికకు ఆరోజు రాత్రి అంతా నిద్ర లేదు. బలవంతంగా కళ్ళు మూసుకున్నా కంటికి కునుకులేదు. తెల్లవార్లూ ఇంక ఈ జాగారమేనా అనుకుంటూ ప్రొద్దుట జరిగిన విషయం మరొకమారు గుర్తుకు తెచ్చుకుంది. బహుశా ఇలా గుర్తుకు తెచ్చుకోవడం ఎన్నోసారో లెక్కలేదు. మామూలుగానే ఈ వేళ కూడా కాలేజీకి బయలుదేరింది. కొద్దిగా దూరమైనా నడిచి వెళ్ళొచ్చు. మధ్యలో దీపక్ ఎదురయ్యాడు. 'దీపక్' ఆ పేరు వింటూనే గుండెలో ఏదో అలజడి. దీపక్‌కి తనంటే ఇష్టమని అతని పరిచయమైన కొన్ని రోజుల్లోనే కనిపెట్టేసింది. కానీ తను బయటపడలేదు. నెమ్మదిగా ఆ పరిచయం రోడ్డుప్రక్కన నడిచే దగ్గరి నుండి పార్లర్‌లో ఐస్‌క్రీమ్ తినడం వరకూ వచ్చింది. ఎన్నో కబుర్లు, ఎన్నెన్నో ఊసులు, కాలమింత త్వరగా ప్రయాణిస్తుందా, అనిపించేది. కానీ తను మాత్రం, అతనిని ఒక స్నేహితుడుగా భావిస్తున్నట్టు మాత్రమే అతనికి చెబుతుండేది. నా మనసుకు మాటలుంటే ఇది అబద్ధమని ఎలుగెత్తి అరిచేదేమో! కానీ దురదృష్టం దానికి మాటలు లేవు. మాటలు వచ్చిన నానుండి ఆ విషయం బయటకు రాదు. ఎందుకంటే నేను సగటు ఆడపిల్లను. ఈరోజు తెల్లవారి తనకళ్ళు చుట్టూ వెదుకుతున్నాయి, ఎవరికోసం వెతుకుతున్నానో, నా కళ్ళ కాటుక నడిగినా చెవుతుంది. నా కళ్ళు మెరిసాయి, దూరంగా 'దీపక్' కానీ ఆ మొహంలో ఏదో భిన్నంగా కనిపించింది. ఎవరిని చూస్తున్నా, ఎవరైతే కనిపిస్తారో ఎవరిని మనసు ఎప్పుడూ స్మరిస్తుంటుందో, ఎవరి మాటలు వినాలని మనసు ఉవ్విళ్లూరుతుందో వారు నా ఎదురుగా... కూగున్నారా! అంటూ పలుకరించాడు. మాటలు రాలేదు. మనసు మూగబోయింది అంటే బహుశా ఇదేనేమో! కళ్ళతోనే పలుకరించాను. దీపక్ నేరుగా విషయానికి వచ్చేశాడు. వాళ్ళింట్లో అతనికి సంబంధాలు చూస్తున్నారంట తన గురించి చెప్పాడంట. వారి అంగీకారానికి మా కులాలు అడ్డొచ్చాయని, మనం ఈ ఊరు విడిచి దూరంగా పారిపోయి తన ప్రేమ కుటీరంలో తన నిజాయితీ చాటుకుంటానని అతని మాటలు సారాంశం.

రేపు తన నిర్ణయం తెలుసుకొనడానికి వస్తానన్నాడు. తను రేపు సరే అంటే ఈ కులాలకు, మతాలకి మనుషుల స్వార్థానికి, అమ్మ, నాన్నలకు దూరంగా...వెళ్ళిపోతుంది. ఆ చివరి పదాలు గుర్తుకు వచ్చేసరికి మనసు ఒక్కసారి బాధగా మూల్గింది. అమ్మ నాన్నలకు పెళ్ళైన పదిహేను సంవత్సరాల తరువాత కలిగిన ఏకైక సంతానం కళ్ళల్లో పెట్టుకుని పెంచారు. అటువంటి అమ్మనాన్నలకు దూరంగానా తను వెళ్ళిపోలుచుకుంది! తను ఎమ్మెస్సీ చదువుతున్నా ఇప్పటికీ తనను చిన్నిపాపాయి లాగే కనిపిస్తానేమో! ఇంకా గోరుముద్దలు తినిపిస్తుంది.

అమ్మ గొప్పతనం గుర్తించడం సాధ్యమా! ఎదురింట్లో నుంచి పాప గుక్కపట్టి ఏడుస్తోంది. ఎదురింట్లో మహేశ్వరి వాళ్ళు ఈ మధ్యనే మూడునెలల కిందట దిగారు. ఒక సంవత్సరం పాప. తన ఈడే అయినా త్వరగా పెళ్ళైపోయింది. బహుశా మహేశ్వరి రోజూ రాత్రి 3, 4 గంటల మినహా నిద్రపోదేమో! ఎప్పుడూ ఆ పాపను వారిస్తూనే ఉంటుంది. అయినా రాత్రిళ్ళుతన పాప నిద్రపోదని, ఏ పీడ కలలు వస్తున్నాయో ఏమిటో అని బెంగపడుతుంది. కానీ ఏరోజు తను సుఖంగా నిద్రపోలేదని ఆలోచించదు. అదేనేమో అమ్మ గొప్పతనం. ఎప్పుడు తెల్లవారిందో ఏమో! అమ్మ తన గదిలోకి కాఫీ తెచ్చింది. రాత్రంతా నిద్రలేక కళ్ళు ఎర్రగా మారి భగభగ మండుతున్నాయి. అంతే అప్పుడే అమ్మ తడిగుడ్డ తెచ్చి తలమీద పెట్టి దిష్టితీసి బయటకు వెళ్ళబోతూ, నిన్ను విడిచి, నేనెక్కడికీ వెళ్ళనమ్మా నీ మనసు నొప్పించనమ్మా, నీ ప్రేమ నాకు కావాలి, వేరెవరి ప్రేమ అక్కరలేదు. అంటున్న నా మాటలు విన్నదేమో! చిట్టితల్లి ఏం కలకన్నదో ఏమో! కలలో కూడా నన్ను వదిలి వెళ్ళలేదు అని ముద్దుగా విసుక్కుంటూ ఉంటే, పావురాయిని గాలిలోకి స్వేచ్ఛగా వదిలిపెట్టాక దాని హృదయంతో పోటీపడుతూ నా మనస్సు కూడా ఆనంద శిఖరాలలోకి ఎగిరింది, 'దీపక్' జ్ఞాపకాలకు దూరంగా.